# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 09-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **తిరుపతి నుంచి షిర్డీకి వెళ్లే తిరుపతి–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్రమంత్రి సోమన్న దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు ప్రారంభించారు.**

3. **ప్రజలకు నాణ్యమైన ఔషధాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

4. **రాజధానికి అవసరమైన ప్రాజెక్టులకు అనుగుణంగా తదుపరి భూసమీకరణ చేపడతామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**

5. **చిత్తూరు జిల్లాలో ఈ ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.**

==========================

రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సరళతరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా రికార్డుల నవీకరణ జరగాలని సూచించారు. గత ప్రభుత్వం ఫ్రీ హోల్డ్‌లో ఉంచిన 5 లక్షల ఎకరాలకుపైగా ఉన్న అసైన్డ్ భూముల వివరాలను పున: పరిశీలించాలని ఆదేశించారు. అలాగే ఈ సాయంత్రం కేంద్ర ప్రభుత్వ " పూర్వోదయ పథకం" పై సమీక్షిస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

తిరుపతి నుంచి షిర్డీకి వెళ్లే తిరుపతి–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర రైల్వే, జలశక్తి సహాయమంత్రి సోమన్న దృశ్య మాధ్యమం ద్వారా ఈ రోజు ప్రారంభించారు. తిరుపతి రైల్వేస్టేషన్ లో ఈ రైలును పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రయాణికులకు విజ్ఞప్తి మేరకు నూతన రైలును ప్రారంభించామని, రెండు ఆధ్యాత్మిక క్షేత్రాలను అనుసంధానం చేస్తూ రైలు నడుస్తుందన్నారు. 6, 700 కోట్ల రూపాయలతో తిరుపతి పరిధిలో రైల్వే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలియజేస్తూ,

వాయిస్..34 సెకన్లు

--------------------------

విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన వరుస సమావేశాలలో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓప్స్ ర్యాంప్ సీఈవోతో సమావేశమై అమరావతిలో డిజైన్, ఇన్నోవేషన్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. శాన్ ఫ్రాన్సిస్కో కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డితో సమావేశమై..ఆంధ్రప్రదేశ్‌లో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జడ్ స్కాలర్ సీఈవో జే చౌదరితోనూ మంత్రి సమావేశమై గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ రీసెర్చ్ వింగ్ ఏర్పాటుచేయాలని లోకేష్ కోరారు.

---------------------------

రాజధానికి అవసరమైన ప్రాజెక్టులకు అనుగుణంగా తదుపరి భూసమీకరణ చేపడతామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలో చేపట్టిన సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణ పనులు, గుంటూరు ఛానల్ పై స్టీల్ బ్రిడ్జి నిర్మాణం, రైతుల ప్లాట్ లలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులను అధికారులతో మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెండేళ్లలో రహదారులు, మురుగు నీటి వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాల పనులు పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. రైతులకు కేటాయించిన 66 వేల ఫ్లాట్స్‌లో 7 వేల ఫ్లాట్స్‌కు మాత్రమే ఇంకా రిజిస్ట్రేషన్ లు చేయాల్సి ఉందన్నారు. భూ సమీకరణలో తీసుకున్న లంక భూములు, అసైన్డ్ భూముల సమస్యలను వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

కాశీ తమిళ సంగమం 4.0 కార్యక్రమంలో పాల్గొంటున్న నాల్గవ బృందం ఈరోజు హనుమాన్ ఘాట్ వద్ద గంగానదిని సందర్శిచడంతో పాటు, ఘాట్‌లోని ప్రఖ్యాత తమిళ కవి సుబ్రమణ్య భారతి ఇంటిని, సమీపంలోని శంకర్ మఠాన్ని సందర్శించింది. అనంతరం ఈ బృందం మధ్యాహ్నం బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి చేరుకుని విద్యా సమావేశంలో పాల్గొంటుంది. ఆలాగే సారనాథ్ చేరుకుని మ్యూజియంను సందర్శిస్తుంది. రేపు ప్రయాగ్‌రాజ్‌లో ఈ బృందం పర్యటిస్తుంది. కాశీ తమిళ సంగమంలో భాగంగా ఈ సంవత్సరం "తమిళం నేర్చుకుందాం" అనే ఇతివృత్తంతో పలుకార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తమిళనాడు ప్రతినిధులు వారణాసిలోని స్థానిక కళాశాలలో తమిళం బోధించి, విద్యార్థులతో సంభాషించారు.

---------------------------

ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఔషధాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన 11 కొత్త ఔషధ నియంత్రణ పరిపాలన–డిసిఎ కార్యాలయాలను గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి దృశ్య మాధ్యమం విధానంలో ఈ రోజు ప్రారంభించారు. అలాగే విశాఖపట్నం, కర్నూలు నగరాల్లో నిర్మించిన రెండు ప్రాంతీయ ఔషధ పరీక్ష ప్రయోగశాలలను కూడా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో నకిలీ, అనధికార ఔషధాల నియంత్రణకు సమర్థవంతమైన వ్యవస్థ అవసరమని అన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయి ప్రధాన ఔషధ పరీక్ష ప్రయోగశాల కూడా అందుబాటులోకి వస్తుందని మంత్రి వెల్లడించారు.

---------------------------

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే స్క్రబ్ టైఫస్ జ్వరాల నిర్ధారణ పరీక్షల నమూనాలను సేకరిస్తున్నట్లు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, స్క్రబ్ టైఫస్ జ్వరాలు సాధారణమైన వాటిల్లో ఒకటని తెలిపారు. స్క్రబ్ టైఫస్‌కు సంబంధించి అధిక కేసులు నమోదైన ప్రాంతాలను గుర్తించి వ్యవసాయ, పంచాయతీరాజ్, శాఖలతో కలిసి, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –సర్ పై పార్లమెంట్ లో ఈ రోజు చర్చను నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంస్కరణలు అనే అంశం కింద సర్ పై కేంద్ర ప్రభుత్వం చర్చను నిర్వహిస్తోంది. విపక్షాల తరపున కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు మనీష్ తివారీ చర్చను ప్రారంభించారు. దీనిపై పలువురు పార్లమెంటు సభ్యులు ప్రసంగించిన అనంతరం కేంద్ర ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది.

---------------------------

చిత్తూరు జిల్లా నగరి మండలం తడుకుపేట వద్ద ఈ  ఉదయం జరిగిన  రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. తిరుచానూరు నుంచి తిరుత్తణి వైపు వెళ్తున్న కారు, ఎదురుగా చెన్నై నుంచి తిరుమల వైపు వస్తున్న మరో కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో తిరుచానూరుకు చెందిన ఇద్దరు, చెన్నైకి చెందిన ఒకరు మృతి చెందారని, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు.  మృతదేహాలను నగరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్నామని తెలిపారు .

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో  రానున్న మూడురోజులపాటు పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

మిర్చి పంటకు ఆశించే తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు  అధికారులను ఆదేశించారు.  రాష్ట్రంలో మిర్చి పంట తెగుళ్లపై  ఆ శాఖ సంచాలకులతో ఈరోజు ఫోన్‌లో మాట్లాడి మంత్రి  వివరాలను అడిగి  తెలుసుకున్నారు.  రైతులకు నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని, ప్రస్తుత పరిస్థితిపై తక్షణ నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఈ మేరకు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాస్త్రవేత్తలను వెంటనే క్షేత్రస్థాయికి పంపించాలని, మందుల పిచికారీపై శాస్త్రీయ సలహాలు రైతులకు అందించాలన్నారు. రైతుల్లో అవగాహన పెంపుకు రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు.

=====================